క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్‌–2 హుడా కాలనీ ఏ టైపు క్వార్టర్స్‌ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కాలనీ అధ్యక్షుడు ఆనంద్‌రాజ్‌ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. మాక్సివిజన్‌ ఐ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి, గ్లోబల్‌ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్లోవ్‌ డెంటల్‌, అపోలో ఫార్మసీల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, బీపీ, షుగర్‌, ఈసీజీ, దంత పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్‌ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



సరూర్‌నగర్‌ పాఠశాలను శుభ్రం చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

లింగోజిగూడ: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్‌ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. సరూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఎల్‌బీనగర్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా సామ రంగారెడ్డి బీజేపీ నాయకులతో కలసి పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేసేందుకు స్వీపర్లు లేరని, విద్యార్థులకు కనీస వసతులు కూడా లేవని ఆరోపించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓ వెంటనే పాఠశాలను సందర్శించి మౌలిక వసతులు కల్పించి, సిబ్బంది కొరతను తీర్చాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్‌ భాస్కర్‌, కృష్ణంరాజు, శ్రీనివాస్‌, గంగాధర్‌గౌడ్‌, మల్కాజిగిరి నాగరాజు, ప్రవీణ్‌రెడ్డి, హరిప్రసాద్‌, జగదీశ్‌, రవి, భరత్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలతో విద్యార్థుల్లో నూతనోత్సాహం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్‌ రమేష్‌

దిల్‌సుఖ్‌నగర్‌: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని శ్రీరామ్‌ కళాశాల చైర్మన్‌ దాచేపల్లి రమేష్‌ అన్నారు. శనివారం సరూర్‌నగర్‌లోని ఇండోర్‌ స్టేడియంలో శ్రీరామ్‌ కళాశాల వార్షిక స్పోర్ట్స్‌ మీట్‌ (క్రికెట్‌, కబడ్డీ, ఖోఖో)ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... రోజూ విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడతారని, ఇలాంటి స్పోర్ట్స్‌ మీట్‌ వల్ల విద్యార్థులకు మానసిక ఉత్తేజం కలుగుతుందన్నారు. క్రీడల వల్ల సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపేందుకు ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్‌ శ్యామల, సిబ్బంది రవీంద్ర, నాగేశ్వరరావు, రమణయ్య, రామేశ్వర్‌ రెడ్డి, యాదగిరి, రాజు, నాగమణి, నాగలత, కవిత, రామ శేషు, సరళ, శ్వేత, నవనీత, మానస తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటు అభినందనీయం



వనస్థలిపురం: వనస్థలిపురంలో సుమారు మూడున్నర దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న లక్ష్మీ ఆయుర్వేద ఆస్పత్రి నిర్వాహకులు వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో మరో యూనిట్‌ ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్థానికులకు ఎంతో ఉపయోగకరమని కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రాంరెడ్డి, మదర్‌ డెయిరీ మాజీ చైర్మన్‌ గంగుల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎఫ్‌సీఐ కాలనీలో లక్ష్మీ ఆయుర్వేద ఆస్పత్రి యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ వై.శ్రీనివాసులు మాట్లాడుతూ... పక్షవాతం, మధుమేహం, సొరియాసిస్‌, కీళ్ల వ్యాధులు తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పింఛన్‌దారులకు రీయింబర్స్‌మెంట్‌ సౌకర్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ పి.వి.రాజు, ఆస్పత్రి డైరెక్టర్‌ డాక్టర్‌ వై.నిఖిత, డాక్టర్‌ నవీన్‌కుమార్‌, నరసింహారావు, రాజుయాదవ్‌, ప్రతాప్‌రెడ్డి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో పరేషాన్‌

- బంజారాబస్తీ నల్లాల్లో మురుగునీటి సరఫరా
- తరుచూ వేధిస్తున్న కలుషిత జలాల సమస్య
- పట్టించుకోని జలమండలి అధికారులు

నల్లాల్లో తాగునీటికి బదులు కలుషిత జలాలు పంపిణీ అవుతున్నాయి. ఉదయం లేచి నీళ్లు పట్టుకుందామని నల్లా తిప్పితే మురుగు నీరు రావడంతో స్థానికులు తీవ్ర భయందోళనకు గురయ్యారు. చేసేది లేక జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ నీటిని తాగిన జనం రోగాల బారిన పడుతున్నారు. ప్రతి సారి ఇలాంటి సమస్య ఉత్పన్నం అవుతున్నా జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



జలమండలి సిబ్బందికి సమస్యను వివరిస్తున్న బంజారా బస్తీవాసులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. తరుచూ పైప్‌లైన్‌ల లీకేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీరు సరఫరా అయ్యే నల్లాల నుంచి మురుగు నీరు సరఫరా అవుతున్నాయి.

- ఎన్టీఆర్‌నగర్‌లోని బంజారాబస్తీలోని నల్లాల నుంచి వారం రోజులుగా మురుగు నీరు సరఫరా అవుతోంది. మంచినీటిలో మురుగు నీరు కలిసి సరఫరా అవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. అయినా జలమండలి అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల ఏదో ఒక చోట రంగు మారిన నీరు సరఫరా అవుతున్నా శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- గతంలోను డివిజన్‌లోని అల్కాపురి, యాదవనగర్‌, ఎన్టీఆర్‌నగర్‌ తదితర కాలనీలలో కలుషిత జలాలు సరఫరా అయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ పునరావృతం అయ్యింది.

ఫిల్టర్‌నీటిని కొనుగోలు చేస్తూ...

- జలమండలి సరఫరా చేసే తాగునీటిపై ప్రజలకు నమ్మకం పోతోంది. ఎప్పుడు చూసినా కలుషిత జలాలు సరఫరా అవుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రజలు ఆధారపడుతున్నారు.
- గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫిల్టర్‌ నీటిని రూ. 25 పెట్టి కొనుగోలు చేసి తాగుతున్నారు. శుద్ధమైన జలాలు సరఫరా చేయాల్సిన జలమండలి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు.

మీరూ మురుగు నీటినే తాగుతారా?

- నల్లాల్లో వచ్చే మురుగు నీటినే మీరూ తాగుతారా అని స్థానికులు జలమండలి అధికారులను ప్రశ్నించారు. ముగుగునీటిని పరిశీలించేందుకు వచ్చిన జలమండలి సిబ్బందిని బంజారా బస్తీవాసులు ఇలా నిలదీశారు. డివిజన్‌లో జలమండలి అధికారులు ఉన్నారో లేదో తెలియడం లేదంటున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.



నల్లాలో సరఫరా అవుతున్న మురుగు నీరు, బాటిళ్లలో కలుషిత నీటిని చూపుతున్న దృశ్యం

వెంటనే పరిష్కరిస్తాం

బంజారాబస్తీలో కొన్ని రోజులుగా కలుషిత జలాలు పంపిణీ అవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి సమస్యను గుర్తించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తాం. అంతవరకు కలుషిత జలాలను తాగొద్దని స్థానికులకు సూచించాం. మరోసారి ఇలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణారెడ్డి, జలమండలి అధికారి

నిత్యం నడకతో పరిపూర్ణ ఆరోగ్యం

మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ ఉదయమే నడకను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులవుతారని మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం జరిగిన శాలివాహన వాకర్స్‌ క్లబ్‌ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి కార్పొరేటర్‌తో పాటు మాజీ కార్పొరేటర్‌ తీగల సునరితఅజిత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్లబ్‌ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వాకర్స్‌ క్లబ్‌ జిల్లా గవర్నర్‌ టి. చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌ యాదవ్‌, కోశాధికారి సదానందం కురుమతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ... వాకర్స్‌ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. క్లబ్‌ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వాకర్స్‌ నాగభూషణం, మాధవరావు, పి.శ్రీనివాసాచారి, ప్రసాద్‌, ప్రవీణ్‌రెడ్డి, జెక్కా మోహన్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, హన్స్‌రాజ్‌, సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహన వాకర్స్‌ క్లబ్‌ నూతన కమిటీ

- మూసారంబాగ్‌ డివిజన్‌ శాలివాహన వాకర్స్‌ క్లబ్‌ నూతన కమిటీ అధ్యక్షుడిగా చెల్లూరి రఘునందన్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్‌ యాదవ్‌, కోశాధికారిగా సదానందం కురుమ, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, నర్సింహారెడ్డి, జాయింట్‌ సెక్రటరీలుగా లచ్చయ్య, యాదయ్యయాదవ్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలుగా అంజయ్య, కమలాకర్‌, పీఆర్‌వోలుగా నారం హన్స్‌రాజ్‌, వై.మురళి, జాలీ వాకర్‌గా లక్ష్మారెడ్డితో పాటు 10 డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు.



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్‌ సునరితారెడ్డి...

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

హయత్‌నగర్‌: మున్సిపాలిటీకి సంబంధించి కాలనీలలో ఎలాంటి సమస్య ఉన్న తనకు తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కారం అయ్యేలా చూస్తామని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని వెంకటేశ్వర, వెంకటాద్రి కాలనీలలో చేపట్టిన అంతర్గత డ్రైనేజీల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. డివిజన్‌లో చాలా కాలనీలకు డ్రైనేజీ సమస్య ఉందని ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మలక్‌పేట ఏరియా హాస్పిటల్‌ను ఆధునికీకరించాలి

సైదాబాద్‌: పాతబస్తీ, శివారు ప్రాంతాలు సహా పలువురు పేద, మధ్య తరగతి వర్గాల వారు వచ్చే మలక్‌పేట ఏరియా హాస్పిటల్‌ను తెలంగాణ ప్రభుత్వం విస్తరించి ఆధునికీకరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్‌ డిమాండ్‌ చేశారు. శనివారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆస్పత్రి ప్రాంగణంలోని హోటల్‌లో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకొని ఒక కార్మికుడు మృతి చెందారని గుర్తుచేశారు. హోటల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో మంటలు ఆస్పత్రికి పాకి ఉంటే గర్భిణులు, నవజాత శిశువుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రులలోని స్థలాలు, భవనాలను వాణిజ్య అవసరాలకు కేటాయించే ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. మలక్‌పేట ఆస్పత్రిలోని వాణిజ్య సముదాయాల లీజును రద్దు చేయాలన్నారు. వాటి స్థలంలో రోగులు, వారి సహాయకులకు భోజన, వసతి సౌకర్యాలు కలిపించేలా విస్తరించాలన్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో వచ్చే గర్భిణుల కోసం మలక్‌పేటలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వాణిజ్య సముదాయాలు తొలగించి రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆయన డిమాండ్‌ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నియామకం



గీతారెడ్డి

మన్సూరాబాద్‌: వరల్డ్‌ హ్యూమన్‌రైట్స్‌ అసోసియేషన్‌ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా హైదరాబాద్‌ మన్సూరాబాద్‌ (ఎల్‌బీనగర్‌)కు చెందిన డి.గీతారెడ్డిని నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అసోసియేషన్‌ జాతీయ చైర్మన్‌ సుబ్బారెడ్డి శనివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా గీతారెడ్డి శనివారం మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ... మహిళా సమస్యలపై చురుగ్గా పోరాటం చేస్తున్న తనను గుర్తించి జాతీయ అధ్యక్షురాలిగా నియమించారన్నారు. సంస్థ అభివృద్ధి, మహిళల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

‘ఎస్‌ఆర్‌డీపీ’ తో మహానగరానికి మహర్దశ



నూతన ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌: వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్‌ఆర్‌డీపీ) ఫలాలు మహానగరానికి మహర్దశ తీసుకొస్తున్నాయని, నిత్యం పద్మవ్యూహాన్ని తలపించే ట్రాఫిక్‌ చిక్కులకు చెక్‌ పెడుతూ నిర్మించిన అండర్‌ పాస్‌లు, ఫ్లై ఓవర్‌లు మంచి ఫలితాను ఇస్తున్నాయని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చింతలకుంట నుంచి కొత్తపేటకు వెళ్లేందుకు నూతనంగా నిర్మించిని ఫ్లై ఓవర్‌ను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ఫ్లై ఓవర్‌ను రూ. 32 కోట్ల వ్యయంతో 760 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మించినట్లు తెలిపారు. నగరాన్ని సిగ్నల్‌ ఫ్రీగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. త్వరలో ఫ్లై ఓవర్‌ అందుబాటులోకి వస్తుందని, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా ప్రారంభిస్తామని అన్నారు. ఎల్‌బీనగర్‌ చౌరస్తాలో రెండు ఫ్లై ఓవర్‌, రెండు అండర్‌ పాస్‌ల కోసం రూ. 120 కోట్లను వెచ్చించామని అన్నారు. నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం



వివేకానందనగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సుజాతానాయక్‌

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆయా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు త్వరితగతిన పూర్తవుతాయని హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. శనివారం సూర్యా టౌన్‌షిప్‌, వివేకానందనగర్‌ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ సుజాతానాయక్‌ మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఈ కనకయ్య ఏఈ హేమూనాయక్‌, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు హనుమంతు నాయక్‌, కుమార్‌, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌ / వనస్థలిపురం రైతుబాజర్‌లలో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాట (లోకల్‌) కిలో రూ. 13, టమాట (618 రకం) రూ. 13, వంకాయ రూ. 28, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 40, కాకరకాయ రూ. 28, బీరకాయ రూ. 45, క్యాలీఫ్లవర్‌ రూ. 23, క్యాబేజీ రూ. 9, క్యారెట్‌ రూ. 21, దొండ రూ. 35, ఆలుగడ్డ రూ. 23, ఉల్లి రూ. 20, గోకర రూ. 40, దోస రూ. 28, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, అరటి కాయ రూ. 9, చిక్కుడు రూ. 55, అర్వి రూ. 70, మునగ రూ. 105, చిలుకడదుంప రూ. 27, బీట్‌రూట్‌ రూ. 17, కీర రూ. 23, బీన్స్‌ రూ. 35, క్యాప్సికమ్‌ రూ. 50 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ రోజు ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కొత్త స్తంభం ఏర్పాటు



మన్సూరాబాద్‌: మన్సూరాబాద్‌ డివిజన్‌ హయత్‌నగర్‌ పరిధి గ్రీన్‌సిటీకాలనీ ప్రధాన రోడ్డులో ట్రాన్స్‌కో విద్యుత్‌ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విషయంపై ట్రాన్స్‌కో.. జర దేఖో అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. నూతన స్తంభం ఏర్పాటుపై స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫుడ్‌ఫెస్ట్‌ అదుర్స్‌



ఫుడ్‌ ఫెస్ట్‌ ప్రారంభిస్తున్న కాలేజీ సెక్రటరీ డాక్టర్‌ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డైరెక్టర్‌ దయాకర్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌ అనిబిసెంట్‌ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం ఫుడ్‌ఫెస్ట్‌ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రకరకాల వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్‌ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌ దయాకర్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ వీణారెడ్డి ఆయా వంటకాలను రుచి చూసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో అవగాహన, ఆహార పదార్థాల ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఫుడ్‌ ఫెస్ట్‌లో పానీపూరి, ఫ్రూట్‌ సాలాడ్‌, కచోరి, మంచురియా, బిర్యానీ, పిండి వంటలు, దాదాపు 40 రకాల వంటలు తయారు చేశారు. కార్యక్రమంలో ఏవో రవీందర్‌, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నక్షత్ర సుహాసిని వ్రతం




అష్టలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రథ సప్తమి సందర్భంగా అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్‌ వాసవి కాలనీలోని ధ్యాన కేంద్రంలో అష్టలక్ష్మి మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం నక్షత్ర సుహాసిని వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి మహిళా మండలి సభ్యురాలు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌



నక్షత్ర సుహాసిని వ్రతంలో పాల్గొన్న మహిళలు

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన వెంకటేశ్వరరావు

హస్తినాపురం: కూలి పనికోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా ఆకునీడు గ్రామానికి చెందిన గండి కోట వెంకటేశ్వరరావు బతుకుదెరువుకోసం కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చి వనస్థలిపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని శారదనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న ఏసురత్నం అనే మేస్త్రీ దగ్గరకు కూలిపనికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో వెంకటేశ్వరరావు భార్య ధనలక్ష్మీ ఏసురత్నంకు ఫోన్‌ చేసి తన భర్త ఆచూకీ గురించి విచారించింది. మధ్యాహ్నం పని నుంచి వెళ్లాడని చెప్పడంతో కంగారు చెందిన దనలక్ష్మీ తన భర్త ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి వంశీకృష్ణ అంత్యక్రియలు

నాగోలు: భార్యతో కలసి విహార యాత్రకు వెళ్లి ఇండోనేసియాలోని బాలి సముద్రంలో మునిగి మృతి చెందిన నాగోలు బండ్లగూడకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి వంశీకృష్ణ అంత్యక్రియలు శనివారం బండ్లగూడ శ్మశాన వాటికలో నిర్వహించారు. భార్య, బంధువులతో కలసి ఈ నెల 13న మలేసియా, ఇండోనేసియాలకు వెళ్లారు. మలేసియా యాత్ర పూర్తి అయిన తరువాత ఇండోనేసియాలోని బాలి సముద్ర దీవి వద్ద కాటేజీలో ఉన్నారు. ఈ నెల 22న బాలికి కొంత దూరంలోని పెన్నిడా ఐలాండ్‌ సముద్ర గర్భంలోని అక్వేరియం సందర్శించేందుకు పర్యాటకులు, ముగ్గురు గైడ్‌లులో వంశీకృష్ణ సముద్రంలోకి వెళ్లారు. వంశీకృష్ణ సముద్రంలో గల్లంతై ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అక్కడి పోలీసులు వంశీకృష్ణ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో ఈ నెల 25న ఇండోనేసియా బాలికి బయలుదేరి వెళ్లారు. సముద్రలోకి వెళ్లే క్రమంలో భయపడి కార్డియాక్‌ అరెస్టుకు గురైనట్లు పోస్టుమార్టం నివేదికలో వెలుగుచూసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం వంశీకృష్ణ మృతదేహాన్ని శుక్రవారం రాత్రి బండ్లగూడ అజయ్‌నగర్‌కు తీసుకొచ్చారు. వంశీకృష్ణ మృతదేహాన్ని చూసి స్థానికులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు. శనివారం బండ్లగూడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

దంత సంరక్షణపై చిన్నారులకు అవగాహన



చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్‌: చిన్నారులకు దంతాల రక్షణపై అవగాహన పెంపొందించాలని యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌ పరిధిలోని ది మాస్టర్‌ మైండ్స్‌ స్కూల్లో శనివారం హోలీయా డెంటల్‌ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హాస్పిటల్‌ నిర్వాహకులు చిన్నారులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్‌ జోత్స్న, ఎండీఎస్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ నవ్య, అడ్మిన్‌ గౌరీ, అరుణ, పగుడాల శ్రీశైలం, వంగాల శ్రీకాంత్‌, పగిళ్ల అంజి, శ్రీను, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని పుస్తెలతాడుతో పరారీ

నాగోలు: నర దృష్టి తీస్తానంటూ మాయమాటలతో ఓ మహిళ దృష్టి మరల్చి బంగారు పుస్తెల తాడు చోరీకి పాల్పడ్డాడు నకిలీ బాబా. ఈ సంఘటన ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్‌ పోలీసుల సమాచారం మేరకు... హస్తినాపురం సెంట్రల్‌లో నివాసం ఉండే చికట్ల వీరలక్ష్మి(20) గృహిణి. శనివారం ఉదయం 11:15 గంటల సమయంలో 60 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి బాబాలా కాషాయ దుస్తులు వేసుకొని వచ్చాడు. తన చేతిలో కుంకుమ పువ్వుతో భిక్ష కోసం వీరలక్ష్మి ఇంటికి వచ్చాడు. ఇంటి వద్దకు రాగానే బాబాకు వరలక్ష్మీ రూ. 10 ఇచ్చింది. ఈ క్రమంలో అతడు మయామాటలు చెప్పి నీకు కొని సమస్యలు ఉన్నాయని నరదృష్టి దూరం చేస్తా పూజ చేయాలంటటూ నమ్మబలికాడు. ఇంట్లోకి వెళ్లి ఒక ప్లేట్‌ తీసుకురావాలని కోరాడు. అతని మాటలు నమ్మిన ఆమె ఇంట్లోకి వెళ్లి ఓ పళ్లెంలో బియ్యం పోసి తీసుకొచ్చింది. మెడలో ఉన్న పుస్తెలతాడు ఇవ్వు నర దృష్టి తీస్తానని చెప్పి ఆమె దగ్గర ఉన్న బంగారు పుస్తెలతాడును తీసుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి కుంకుడు కాయ, పసుపు పొడి తీసురావాలని ఆ మహిళకు సూచించాడు. దీంతో వీరలక్ష్మి ఇంట్లోకి వెళ్లగానే 6 గ్రాములు ఉన్న బంగారు పుస్తెలు తీసుకొని పారిపోయాడు. ఇంట్లోంచి బయటికొచ్చిన వరలక్ష్మికి బాబా కనిపించ పోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని ఎల్‌బీనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరలక్ష్మి మెడలో ఉన్న పుస్తెల తాడు రోల్డ్‌ గోల్డ్‌ని తాడుకు ఉన్న రెండు మాత్రమే బంగారు పుస్తెలు అని పోలీసులు తెలిపారు.